# నేటివాటునే నేస్తా...

ప్రతాప రవిశంకర



**మాలతి** సాధారణమైన అందగత్తె.

ఆమె ఇంటర్ పాసయింది. టైప్ రైటింగ్ హయ్యర్ గ్రేడ్ కూడా పాసయింది. ప్రస్తుతం ఒక టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో మాలతి ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తూంది. అందుకు ఆమెకు నెలకు నూటఇరవై రూపాయల జీతం వస్తుంది.

అంతో ఇంతో డబ్బు ఉన్న కుటుంబాలలో ఒక ఆడపిల్ల పెళ్ళి చెయ్యటం ఒక సమస్య అవక పోవచ్చు. కాని మాలతి తండ్రికి ఆమె పెళ్ళి ఒక సమస్య అయి కూర్చున్నది. ఆయన పెద్ద ఉద్యోగస్థుడు కాడు. అతనికి పై సంపాదన లేదు. ఇతరవిధమైన ఆస్తులూ ఆయన అధీనంలో లేవు. మాలతి తండ్రి ఒక పెద్ద కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన దురదృష్టం—ఆయనకు ముగ్గురూ ఆడపిల్లలే పుట్టారు. మరో ఆడపిల్ల పుట్టే అవకాశాన్ని ఆయన భార్య ఆయనకు కలిగించలేదు. భర్తకు ఎదురుతిరిగి ఆపరేషన్ చేయించుకున్నది ఆ రోజుల్లోనే.

భార్యా పిల్లల అనారోగ్యం కారణంగా మాలతి తండ్రి ఆడపిల్లల పెళ్ళిళ్ళ కోసం కొంచెం డబ్బు కూడా పొదుపు చెయ్యలేక పోయాడు. ఇప్పుడు మాలతి పెళ్ళికి ఎదిగి వచ్చిన తరవాత తన దగ్గర డబ్బు లేకపోవటమే ఒక సమస్య అయింది.

తన పెళ్ళి భారాన్ని తండ్రికి కొంచెం అయినా తగ్గించాలనే ఉద్దేశంతోనే మాలతి ఉద్యోగంలో చేరింది. కూతురు ఉద్యోగంలో చేరటానికి ఆమె తండ్రి ముందు ఒప్పుకోలేదు. తల్లి సపోర్టు కూడా మాలతికే ఉండటంతో ఆయన ఒప్పుకోక తప్పలేదు.

మాలతి ఉద్యోగంలో చేరిన ఇరవై రోజుల తరవాత ఒక యువకుడు ఆమెతో కావాలనే పరిచయాన్ని పెంచుకోవటం మొదలుపెట్టాడు.

ఆ యువకుడిలో ఎటువంటి దురాలోచనలూ లేవనే నమ్మకం ఏర్పడిన తరవాత మాలతి అతనితో పరిచయానికి ఒప్పుకున్నది. ఇలా ఒప్పుకోవడానికి ఇంకో కారణంకూడా ఉన్నది. ఆ యువకుడు మాలతి కులం మనిషే. ఒకవేళ అతను తనని పెళ్ళి చేసుకోవాలని అనుకుంటే...!

ఇలా వూహించే మాలతి ఒక రోజు సాయంత్రం ఆ యువకుడి ఆహ్వానాన్ని మన్నించి అతణ్ణి ఒక పార్కులో కలుసుకున్నది.

ఆ యువకుని పేరు ధనుంజయ్. అతనికి ఈ మధ్యనే ఒక ప్రభుత్వ కార్యాలయంలో క్లర్కు ఉద్యోగం వచ్చింది. అతను సాధారణమైన దుస్తులు ధరించాడు. మనిషి బాగా నిరాడంబరంగా మాలతికి కనిపించాడు.

పార్కులో ఆ సాయంత్రం వేళ నీరెండలో క్రోటన్ మొక్కల పక్కనే ఎదురు ఎదురుగా ఇద్దరూ కూర్చున్నారు.

కొంచెం సేపటి తరవాత "మీరు నన్ను బాగా ఆకర్షించారు" అని అన్నాడు, ధనుంజయ్.

మాలతి మాట్లాడలేదు.

తరవాత అతనే మాట్లాడాడు. "మీ రూపమే కాదు. మీ మంచి నడవడిక కూడా నన్ను ఆకర్షించింది. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను."

అతని మాటలకు మాలతి అంతగా పొంగిపోలేదు. ఎటువంటి స్పందనకూ లోనవలేదు. ఆమెలో ప్రేమించే హృదయం లేదని కాదు. కాని ఈ లోకాన్ని ఆమె బాగా అర్థం చేసుకున్నది. జీవితాన్ని కలల్లో గడపటం కంటే వాస్తవంగా చూడగలగటాన్ని మాలతి అలవాటు చేసుకున్నది.

అందువల్లనే కేవలం "థాంక్స్" అని వూరుకున్నది.

మరోసారి గొంతు సవరించుకుని "నాకు మీ మీద ఉన్న ప్రేమతోపాటు మీరుకూడా నా సొంతం కావాలి. అందుకని నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను. మీ ఉద్దేశ

మేమిటి?'' అని అడిగాడు ధనుంజయ్.

అప్పుడు మాలతి కొంచెం ఆశ్చర్య పడింది. అంత త్వరగా అతడు పెళ్ళి గురించి మాట్లాడుతాడని ఆమె ఊహించలేదు.

''చెప్పండి.''

''మిమ్మల్ని పెళ్ళి చేసుకోవటానికి నాకు ఎటువంటి అభ్యంతరం లేదు. మా కుటుంబ పరిస్థితులు మీకు తెలియవు. నా పెళ్ళి వలన మీకు కట్నం రాదు'' అన్నది అతడి కళ్ళలోకి చూస్తూ.

ఆ మాట వినగానే ధనుంజయ్ కొంచెం కంగారు పడటం ఆమె గమనించింది.

తరవాత ''మాట్లాడరేం?'' అన్నది.

''ప్లీజ్, నన్ను అర్థం చేసుకోండి. కట్నం తీసుకోవటం నాకు ఇష్టం లేదు. మా కుటుంబంకూడా పెద్దది. ఖర్చు ఎక్కువ. ఆదాయం తక్కువ. నాకు అర్జంటుగా పెళ్ళికి ఎదిగిన ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. అంతో, ఇంతో కట్నం ఇవ్వనిదే వారిద్దరి పెళ్ళిళ్ళు కావు. నా పెళ్ళికి వచ్చే కట్నంతో ఒక చెల్లెలు పెళ్ళి చెయ్యాలని మా నాన్న అనుకుంటున్నాడు. అంతకుమించి మరో దారి లేదు. నా ఉద్దేశంకూడా అదే. కనీసం మీ వాళ్ళు ఒక అయిదు వేలయినా కట్నంగా ఇవ్వలేరా?'' అని అడిగాడు ధనుంజయ్.


''ఇవ్వలేరు'' అన్నది మాలతి.

''దురదృష్టం. మన మధ్య ప్రేమ ఉండి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఒకటి కాలేక పోతున్నాము. ఇదే ఈ దేశపు దౌర్భాగ్యం. మిమ్మల్ని నేనుకట్నంలేకుండా పెళ్ళి చేసుకున్నా నా చెల్లెళ్ళను అలా చేసుకోగల మనిషి దొరకాలి గదా! క్షమించండి, మాలతిగారూ. మనం విడి పోతున్నాం'' అని ధనుంజయ్ వెళ్ళి పోయాడు.

మాలతి భారంగా నిట్టూర్చింది.

ఆ తరవాత మాలతికి కొన్ని పెళ్ళి సంబంధాలు వచ్చాయి. మాలతి, ఆమె చదువు నచ్చినా ఆమె తండ్రి కట్నం ఇవ్వలేని కారణంగా ఆమె పరిస్థితి మామూలుగానే ఉండిపోయింది.

మరో రెండు నెలలు గడిచిన తరవాత మాలతికి మరో యువకుడు ఈశ్వర్‌తో పరిచయమయింది. అతను సెల్ఫ్‌గా ఎంప్లాయ్‌మెంట్ స్కీము కింద ఒక వ్యాపారాన్ని చేస్తున్నాడు. అతను తన కులం మనిషి కాకపోయినా అతని మంచితనానికి ఆకర్షితురాలై అతనితో స్నేహం చేసింది మాలతి. కాని ఈశ్వర్ ఆమెను గాఢంగా ప్రేమించాడు. ఆమె




తన అర్ధాంగి అయితే జీవితంలో తను సుఖపడగల డనిపించింది. ఆమె కుటుంబ పరిస్థితులన్నీ అతను తెలుసుకున్నాడు. అందుకే తన మనసులో మాటను ఆమెకు చెప్పటానికి మాలతిని తనతో పార్కుకు రమ్మని అడిగాడు.

మాలతి నిరాకరించ లేదు. వెళ్ళింది. ఇంతకుముందు ధనుంజయ్, తనకి కూర్చున్న చోటునే కూర్చున్నా రిద్దరూ. ఆమెకు అప్పటి సంభాషణ కళ్ళ ముందు కదలింది.

కొంచెం సేపటి మవునం తరవాత ఈశ్వర్ తన మనసులో ఆమె పట్ల ఉన్న ప్రేమను బయట పెట్టి ఆమెకు అభ్యంతరం లేకపోతే కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటానని అన్నాడు.

''మన పెళ్ళికి నాకు ఇష్టమయినా మా ఇంట్లో ఒప్పుకోరు. ఎందుకంటే, మనిద్దరి కులం ఒకటి కాదు'' అన్నది మాలతి.

''నిజమా!'' అన్నా డతను.

''అవును. మా తల్లిదండ్రులకు ఇటువంటి పట్టింపులు బాగా ఉన్నాయి. బహుశా మా అమ్మ నన్ను సపోర్టు చేసినా మా నాన్న ఇందుకు ఒప్పుకోడు'' అన్నది.

''ఇది దారుణం. ఇద్దరి మనసులు కలిసి కులం కారణంగా విడిపోవటం అన్యాయం. ఇందుకు నేను ఒప్పుకోను. మన ప్రేమ ఫలించటం కోసం మీరు ఒక సాహసం చెయ్యగలరా?'' అని అడిగాడు ఈశ్వర్.

''ఏమి టా సాహసం?''

''మనిద్దరం మీ ఇంట్లో తెలియకుండా ఎక్కడకయినా వెళ్ళి పెళ్ళి చేసుకుందాం.''

ఉలిక్కి పడింది మాలతి.

తరవాత ''క్షమించండి. ఇన్నేళ్ళు నన్ను పెంచిన తల్లిదండ్రులకు అన్యాయం చెయ్యలేను. వాళ్ళ నా సుఖం, సంతోషం కోరే మనుషులే అయినా ఇటువంటి పని చేసి వారి మనసును నొప్పించలేను'' అన్నది.

ఈశ్వర్ వెంటనే అన్నాడు: ''నాకు మీరు మరీ నచ్చారు, మాలతిగారూ. మిమ్మల్ని పెంచి పెద్ద చేసిన మనుషుల పట్ల మీకు ఉన్న విశ్వాసం చాలా గొప్పది. కాని మిమ్మల్ని విడిచి నేను ఉండలేనని అనిపిస్తూంది. మీరులేకుండా నేను నా జీవితాన్ని ఊహించుకో లేక పోతున్నాను.''

''ఒక పని చెయ్యండి. ఈ ఒక్క రాత్రి నాకు ఆలోచించుకోవటానికి అవ కాశం ఇవ్వండి. మన సమస్యకు పరిష్కారం ఏదయినా దొరుకుతుందేమో చూస్తాను'' అన్నదిమాలతి

ఈశ్వర్ అందుకు ఒప్పుకున్నాడు.

ఇంటికి బయలుదేరింది మాలతి.

ఆమెకు అంతా చిత్రమనిపించింది.

ధనుంజయ్‌కీ, తనకీ మధ్య పెళ్ళి కాకుండా డబ్బు అడ్డుగా నిలిచింది. అప్పుడు తను ఆర్థిక పరమయిన ఇబ్బందే కారణమనుకున్నది.

కాని ఈరోజు ఈశ్వర్‌కీ, తనకీ మధ్య కులం అడ్డుగా నిలుస్తూంది.

అంతర్గతమైన ప్రేమను సంఘ పరమైన, బాహ్యమైన పెళ్ళి వరకు తీసుకు రాకుండా ఇన్ని అడ్డుగోడలు లేస్తున్నాయి అనుకుంది.

ఈ అడ్డు గోడలు కూలిపోయేది ఎప్పుడు? అనుకున్నది.

మాలతి ఇంటికి వచ్చేసరికి చీకటి పడింది.

ఆ రోజు రాత్రి ఎనిమిది గంట లప్పుడు మాలతి తండ్రి చిదంబరం మరో మనిషిని వెంటబెట్టుకుని వచ్చాడు. ఆయన పేరు వెంకటరత్నం. ఆయన కూడా చిదంబరంతో అదే సంస్థలో పని చేస్తున్నాడు.

ఆయన భార్య, పిల్లలు ఏదో ఊరు వెళ్ళారని వెంకటరత్నాన్ని తన ఇంటికి భోజనానికి తీసుకు వచ్చాడు.

ఎప్పుడయినా వెంకటరత్నాన్ని భోజనానికి పిలిస్తే అతనికి మధ్య గది లోనో, వసారాలోనో భోజనం పెట్టే వాళ్ళు. ఎందుకంటే, అతను చిదంబరం కులం మనిషి కాదు.

కాని అందుకు వ్యతిరేకంగా చిదంబరం వెంకటరత్నానికికూడా తన పక్కనే వడ్డించమని చెప్పాడు భార్యకు.

ఆమెకు మతి పోయింది ఆ మాటతో. మాలతికూడా నమ్మలేనట్లుగా తండ్రి కేసి చూసింది.

''ఎందుకయ్యా, చిదంబరం? నా మామూలు చోట్లోనే నాకు భోజనం పెట్టండి'' అన్నాడు వెంకటరత్నం ఇబ్బందిగా.

కాని చిదంబరం వినలేదు. ఆయన్ని బలవంత పెట్టాడు. వెంకటరత్నం సరసనే తనుకూడా భోజనం చేశాడు.

ఈ సంఘటన చూసిన తరవాత మాలతికి తన పెళ్ళి సమస్యకు పరిష్కారం దొరికినట్లు అనిపించింది.

ఆమె హృదయంలో ఆశ తళుక్కు మన్నది.

తండ్రి కులం పట్ల తన పట్టును సడలించుకుంటున్నాడు.

సంతోషంతో ఆ రాత్రి హాయిగా నిద్ర పోయింది మాలతి.

అదే రాత్రి మాలతి తండ్రి నిద్ర పోలేదు. తనలో తనే సంఘర్షణకు లోనయ్యాడు. తప్పదు. తను నమ్మిన కులం తన కూతురు జీవితానికి అడ్డు గోడ కాకూడదు.

తన తండ్రి పార్కులో ఈశ్వర్ తను మాట్లాడుకోవటం విన్నాడనీ, కులం కారణంగా కూతురు జీవితంలో ఒక మంచి అవకాశాన్ని కాలదన్నుకుంటుందనీ అలా జరక్కుండా చూడటానికే, తన మనసును ఆమెకు తెలియ జేయటానికే వెంకటరత్నాన్ని తన సరసన భోజనానికి కూర్చో బెట్టుకున్నాడనీ మాలతికి తెలుస్తుందా? ✱